# దమయంతి

శ్రీమతి దాసరి శారద

దమయంతి విదర్భరాజగు భీముని కూతురు. సుందరి, సుగుణవతి. జనులు నలుని గుణములు పొగడుచుండగాఁ విని మనసార నతని ప్రేమించినది. హంస తనకుఁ జిక్కినపుడు నలుని నాకు గూర్పమని వేడినది.

ఇంద్రాది దేవతలు తన్ను వరింప మన్నను వినక మానవ మాత్రునందే మనస్సు గాఢముగ నిలిపియున్నదిగాని త్రిప్పుకొనలేదు. దేవతలు వచ్చి వేఁడిన నంగీకరింపని మానవ స్త్రీలుందురా? దమయంతి తప్ప. నలుడువచ్చి దేవతల వరింపు మన్నపుడామె యేమన్నదీ? "ఏనేడ నింద్రాదులేడ వారలకు నెప్పుడు మ్రొక్కుదా. నేను నీ ధనము. నీకై యీ రాజు లందఱ రప్పించితిమి. దయయుంచి నన్నంగీకరింపు"మని వేడుకొన్నది. "వారి పాదరజంబుఁబోలని వాని నన్ను మనుష్య సంసారిఁగోరఁగఁ జన్నె నీకుఁ బ్రసన్నులై సురలుండఁగా" అని నలు డన్నపుడు దమయంతి కన్నీరుగార నేడ్చి "వారి సన్నిధినే నిన్ను వరియించెద. అపుడు మన మిద్దరము నిర్దోషులమగుదు" మని యుపాయముగ పల్కిన వివేకవతి దమయంతి. సిరివచ్చుచుండ మోకా లొడ్డినది దమయంతి. 'మనసునకైకొన్న భర్త మానందగునే?' అని సావిత్రివలె ననుకొన్నది గాఁబోలు.

నలుఁడు పుష్కరునితో జూదమాడుచు నోడిపోవుచుండ దమయంతి దూరదృష్టి కలిగి భర్తను వారింపక మంత్రిపురోహిత బాంధవాదులతో నాలోచించి తనకొడుకు నింద్రసేనుని, కూఁతు నింద్రసేనను తన బుట్టింటి కంపినది, వారికపాయముకలుగకుండుటకు. తానొక్కతెయ భర్తతో నడవులలోఁ గష్టాలు పడుటకు. ఎంతయోచన? కట్టువస్త్రమును లేక బాధపడు నలుని మా పుట్టింటికేగుదము రమ్మన్నది. అందుకు పౌరుషవంతుఁడగు నలుఁడంగీకరింపక నీ వరుగుమన్నాడు. అప్పుడామె నిన్నువదలి నేనుపోను. నన్నును నీవు వదలి వెళ్ళవలదు,

"అఖిల దుఃఖరోగార్తున కౌషధంబు, నురు
చిరంబుగ భార్యయ చూవె యెందు।
నొనర భార్యా సమేతుఁడై యున్నవాని
కెంత లాపదలయ్యును నెఱుకపడవు.
అలయు నెడ, డయ్యు నెడ, నాఁకలియుఁ
దృషయు నైన యెడలఁ గనుకొని
ధరణీ తలనాథ పురుషునకు నిర్మల భార్యయ
పాచుఁ జిత్తమున దుఃఖమ్మున్."

అని నిన్ను నమ్ముకొనియున్న నన్ను వదలకుమని దుఃఖించినది. తాను గష్టాలు పడుచుంట చూచి నలుఁడు సహింపక వదలి వెళ్ళినచో నామె పుట్టింటికి జేరునుగదా యసి నలుఁడు అనుకొనుచున్నాడని వాసన పట్టి అట్లన్నది. పరేంగితముల నెఱుగు నేర్పరి దమయంతి.

ఎఱుక తన్నపేక్షింపఁగా నపుడేమియు దోఁచక రక్షించుకొన మఱొకయు పాయములేక శపించినది. ఈమెకడ శపించు శక్తియున్నది కాబోలు. ఆవల నామె చనుపతోఁగలసి సుబాహుపురము చేరి రాజమాతకడనున్నది. అపుడు రాజ భోగములనంగీకరింపలేదు. ఆమె రాజమాతతో,

"ఏను సైరంధ్రీవ్రతంబు చేకొని యుండెద. ఉచ్ఛిష్టంబు భుజింపను. పదధావనంబు చేయను. పరపురుషులతోఁ బలుకనోప. పతినన్వేషించుపొంటె నరిగెడు బ్రాహ్మణులతో బలుకుదు." అట్లైననే నీ యొద్దనుందునన్నది - ఎంత దీక్షయో జూచితిరా?

అవ్వల విదర్భకరిగియుఁ దన తల్లి దండ్రుల కడఁగూడ నామెయిట్లేయుండెను. భర్తచించుకొని పోఁగా మిగిలిన సగము చీరతోడనే యామెయున్నదిగాని మఱొక చీరను గట్టుకొనలేదు. పతివ్రతయన్న నామెయే. భర్తను వెదుకుటకే యల్లరి చిల్లరి వారినోపంపుట యపచారమనుకొని బ్రాహ్మణులనే మంచివారినే యేరిపంపినది. వారేగి నోటికి వచ్చినట్లందురేమో? అందుచే నలునకుఁగోపము వచ్చునేమో? అని యిట్లే అనవలెనని పాఠము చెప్పినది,

"సత్య నిత్యుండవు సతినింతి వర్జించి
దాని వస్త్రార్ధంబు దఱిగి నీవు
పరిధానముగఁ జేసిపాడియే పోవంగ?
భార్య భర్తయు నీఁగఁ బరగుధర్మ
మది మిథ్యయయ్యె నీ యందు. నీ కిట్టి
నిర్దయబుద్ధి చేకొనదగునె?

యట్టి సాధ్వికిఁ గరుణాప్రసన్నుండ వగుము" అని చెప్పిపంపినది. ఈ మాటలు విని పౌరుషము, శౌర్యముగల నలుఁ డుత్తరమీయ కూరకుండఁడని నలుని స్వభావ మెఱింగిన దమయంతి తలచినది. నలుఁడు కృశించి యెఱిగినవారైన గుర్తుపట్ట వీలులేని స్థితిలో నుండుననియు, అట్టివాని నెఱుగనివారు గుర్తుపట్టుటెట్లనీయు నాలోచించి భావమువలనఁగాని గుర్తుపట్ట వీలు లేదని యూహించి యిట్లన్నది. నిజమునకుఁ గృశించియేగాక వికృతాకారుడనయ్యె నలుడుండెఁగదా. అట్టివాని నొరులెట్లు గుర్తించుట?

నలుని గుర్తించి నా క్షేమము చెప్పి తీసికొని రండన్నది. రానిచో నా సంగతి వచ్చి నాకుఁ జెప్పుడన్నది. పర్ణాదుఁ

వెఱిఁగివచ్చి చెప్పిన పిదప నతండే నలుఁడై యుండునని యనుమానించి వానిని రప్పించుటకై యోచించి యుపాయముఁ బన్ని యతఁడే నలుఁడైనచో నశ్వహృదయ మతనికి వచ్చియుండవలె. అదియు బరీక్షింతమని భావించి యెల్లి ద్వితీయ స్వయంవరమని ఋతుపర్ణుడు తమ పట్టణమునకు వచ్చునట్లుచేయవలసినదని చెప్పి వివేకవంతుడును, నుపాయశాలి తన్నుఁ దెలిసికొనఁ గలిగినవాఁడునగు సుదేవు నంపినది. మరియందరు దూతకృత్యమును నెరవేర్ప గలరా? ఋతుపర్ణుఁడు విదర్భకు వచ్చిన పిదప "వైదర్భియొరున్ - వరియింపనంత ధర్మేతర చరితయే" అని భావించెను.

దమయంతి బాహుక వార్ష్ణేయులం జూచి వార్ష్ణేయుం సూతపుత్రునిగా గుర్తించి బాహుకు డెవఁడా? యింత వికృతముగా నున్నాఁడే? యితఁడు నలుఁడెట్లగునా? కానిచో వీనిం జూచిన నా మదియేల సంతోషించుచున్నది. పర్ణాదునకుత్తరమిచ్చి యితనిని తెలిసికొనవలెనని కేశిని నంపినది. అదిపోయి మాయా మాటలు మాటాడి-

"అడవిలో వస్త్రార్థహారియై దయలేక ప్రాణేశ్వరుఁడు దన్ను బాసి చనిన నాటి వస్త్రార్థంబు నలినాక్షి యిపుడు పరిధానముగఁ బాంసుపటల మలినమగుచున్న తనువుతో, ననయంబు జడగొన్న యలకావలులతోడ నవనితలము శయనంబుగా ధర్మచారిణి దమయంతి యనఘవ్రతంబుల నాచరించుచున్న" దనును. ఆ మాటలు విని నలుఁడు మొగము త్రిప్పికొని కన్నీరు పెట్టుకొనును. ఆ సంగతి కేశినివచ్చి చెప్పినది. అంతటితోడ నూరకొనక మఱియుఁ బరీక్షింపనెంచి నలుఁడు వంటచేయునపుడు చూచి రమ్మన్నది. దేవతల వరములు నలునకుం గలవు. అందగ్ని వరుణులు "వాని వలచినచోట నయనలోదకంబులుత్పాదింప" వరమిచ్చిరి. నలుఁడిప్పుడు వంటఁజేయ సమకట్టి తృణముష్టిఁగొని వీచిన నందగ్నియుదయించి కట్టెలు లేకుండనే వంటయగువఱకు మండుచుండెను. ఈ విషయము కేశినిచూచి వచ్చి చెప్పుటతోడనే యంతతో తృప్తిపడక నలుని పాకము రుచి యెఱిఁగియున్నదిగాన వాఁడువండిన నంజుళ్ళు తెప్పించి, తిని, రుచి వలన, నలుఁడేయని గ్రహించెను. అంతటితోడను నమ్మికయూరకుండక ప్రేమనుదాచి పెట్టిన దాగియుండదు. అందు బుత్రప్రేమ కట్టలు తెంచికొని ప్రవహించుచుండును. కానఁ గొడుకును గూఁతును వానికడకు నంపి పరీక్షించెను. నలుఁడా పిల్లలఁగన్నీరు కార్చుచు నెత్తికొని కేశనితో "నాపిల్లలవలె నున్న నెత్తికొంటిని" అనెను. ఇన్నివిధముల నలుని దమయంతి పరీక్షించి నలునిగా

గ్రహించి తండ్రితోఁ జెప్పినది. అప్పుడును నేనచటికే గవలయునా? అతఁడిచ్చటికి రావలయునా? ఏదిసముచిత మార్గమని దమయంతి తండ్రినడిగినది. ఎంత వినయమో చూడుడు. భీముఁడు ఋతుపర్ణునితోఁ జెప్పంగాబోలు, బాహుకుఁడే దమయంతి కడకువచ్చి యీమెంజూచెను. అప్పుడెట్లున్నదామె,

“చనుదెంచియుండు దీనానన, నవిరళ పంక
మలిన నతగాత్ర,
దపఁస్విని, నతికృశ, దమయంతింగనియె న
లుండు దితబాష్పకణకలిత ముఖిన్.”

దమయంతి యీ వేష మెవ్వరి గుండెలఁ గఱిగింపదు? ఆమె నలునితో సిగ్గుభయముతోప నిట్లన్నది.

“సురనరులను మెచ్చకతను - వరియించిన
నన్నుఁ బుత్రవతినే లోకో చె
చ్చెరవిడిచె, నాతనికి నిష్కారుణనకే నేమి
యెగ్గు కావించితినో.”

ప్రాణసమానవైన నిన్ను విడువనన్న మాటల్ తేలమఱచెనోయని యేడ్చినది. నలుఁడు నీ రెండవ పెండ్లి చూడవచ్చితి ననగా, నిన్ను రప్పింప నట్లంటిమి,

“ఏనతి పాపభావమున నెగ్గుఁదలంపఁ దలంప
కొండుగా
నానతవైరి ! నీ యడుగులంటఁగ నోపుదు,
నట్లయైన న
న్నీననిగాడ్పుఁ డీయనలుఁడీ మృగలాంఛనుఁ డీ
సురోత్తముల్
జాను వడంగ నాత్మణను చంపరె? కోపపరీత
చిత్తులై”

అన్నది. అపుడ వాయుభట్టారకుం డీమె పతివ్రత. ఈమె నొండాడకుము. మూడేండ్లనుండియు నీమెను సూర్యచంద్రులు నేనును గాపాడుచుంటిమి. ఈమెను బరిగ్రహింపుమనెను. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. ఎంత శీలవతి దమయంతి!

